క్లుప్తంగా

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు తనిఖీ



వాహనాల తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్

సారంగపూర్: మండలంలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో రాంసింగ్ తండా వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. ఇప్పటి వరకు తనిఖీ చేపట్టిన వాహనాల వివరాల రిజిష్టర్లు పరిశీలించి, అక్కడే ఉన్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్‌తో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన గుండ విజయ్ తండ్రి గత కొన్నేళ్ల క్రితమే మృతిచెందగా, తల్లి ఇటీవల గొంతు క్యాన్సర్‌తో మృతిచెందింది. తల్లిదండ్రులను కోల్పోయిన విజయ్‌కు ×జై జవాన్ జై కిసాన్ ఫౌండేషన్×సభ్యులు శుక్రవారం రూ.3700 ఆర్థికసాయం అందజేశారు. కట్ల సాగర్, రాజేశ్, రాజు, అంజి, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో శుక్రవారం అన్నప్రాసన, అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బదిలీపై వచ్చిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బచ్చు వెంకటరమణ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జి.నర్సయ్యను సన్మానించారు. అంగన్‌వాడీ టీచర్ నేదూరి విజయనిర్మల, పంచాయతీ కార్యదర్శి మౌనిక, తదితరులు ఉన్నారు.

25న రైతుసంఘం సమావేశం

సారంగపూర్: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఈనెల 25న తెలంగాణ రైతు సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ విలాస్, ఎల్‌ఆర్ ఉపాలి తెలిపారు. సమావేశానికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కరపత్రాల పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. రైతుల సమస్యలను ఒక వేదిక ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్చిమ పద్మ హాజరవుతారని పేర్కొన్నారు.

వేధిస్తే 100 డయల్ చేయండి

నిర్మల్‌టౌన్: ఎవరైనా వేధిస్తే 100 డయల్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని షీటీం పోలీసులు తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియం వద్ద గల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. 100 డయల్, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, సీసీ కెమెరాల వల్ల ఉపయోగాలు, టోల్ ఫ్రీ నెంబర్ 1930 తదితర గురించి వివరించారు. షీ టీం ఎమర్జెన్సీ నెంబర్ 8712659550కు ఫోన్ చేయాలని సూచించారు. షీటీం పోలీసులు రమాదేవి, రాధిక, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు ప్రజావేదిక

సోన్: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ సంవత్సరం ఏప్రిల్ 31 తేదీ వరకు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక బృందాలు తనిఖీ చేపట్టి సమావేశంలో నివేదించనున్నారు. సంబంధిత శాఖ అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆలయంలో సత్సంగ్

కుంటాల: జ్యేష్ఠ మాసపౌర్ణమి సందర్భంగా మండలంలోని కల్లూర్ శ్రీ మార్కండేయ ఆలయంలో శుక్రవారం సత్సంగ్ కార్యక్రమం నిర్వహిచారు. రెడ్డి మహారాజ్ భక్తులకు ప్రవచనాలు బోధించారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు అభినందన

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి పూర్తిచేసిన పలువురు విద్యార్థులు పలు ప్రభుత్వ కార్పొరేట్ స్థాయి పాఠశాలల్లో ఇంటర్ కోసం సీట్లు సాధించారు. వీరిని ఇన్‌చార్జి హెచ్‌ఎం నరేంద్ర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.



కడెం: లింగాపూర్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల యోగాసనాలు



లక్ష్మణచాంద: పిరమిడ్ ఆకృతిలో బాలికలు

ఘనంగా యోగా డే



భైంసాటౌన్: ఆల్ఫోర్స్ పాఠశాలలో..



సోన్: బ్రాహ్మణ మఠంలో..



ముధోల్‌లో..

భైంసాటౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులు యోగా చేశారు. ఉపాధ్యాయులు, మాస్టర్ వారితో యోగాసనాలు వేయించారు. యోగా ప్రాధాన్యతను వివరించారు. హైదరాబాద్‌లోని నిజాం కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ పాల్గొన్నారు. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, ఇతర ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి యోగాసనాలు వేశారు. స్థానిక దారాబ్జి ఫ్యాక్టరీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్ రావు పటేల్ ఆధ్వర్యంలో, భైంసా ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. భైంసా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, నారాయణరెడ్డి, రమేశ్ మాశెట్టివార్, కృష్ణదాస్ ఉన్నారు.

సోన్: కేజీబీవీలో విద్యార్థులు యోగా ఆకారంలో కూర్చున్నారు. బ్రాహ్మణమఠం కల్యాణ మండపంలో బీజేపీ నేతలు యోగసనాలు వేశారు. నాయకులు జక్క రాజేశ్వర్, హరీశ్‌రెడ్డి, గంగారెడ్డి, శ్రీనివాస్, బొనగిరి నర్సయ్య పాల్గొన్నారు.

ఖానాపూర్: ఖానాపూర్ కోర్టు భవనం ఆవరణలో జడ్జి అజయ్‌కుమార్, న్యాయవాదులు పలు యోగాసనాలు చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ సైదారావు, ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో సిబ్బందితో యోగా నిర్వహించారు.

తానూరు/ముధోల్/కడెం/లక్ష్మణచాంద/కుంటాల/లోకేశ్వరం/భైంసారూరల్: మండలాల్లోని విద్యాసంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తానూరు మండలం భోసి, బెంబర గ్రామాల్లో ఉపాధి కూలీలు పనుల నిర్వహించే ప్రదేశంలో యోగాసనాలు చేశారు. కుంటాల మండలం కల్లూర్‌లో యోగా సాధకులకు యోగా శిక్షకుడు గజానన్ అవగాహన కల్పించారు. లోకేశ్వరంలో, భైంసా మండలం దేగాం, మిర్జాపూర్, ఖథ్‌గాం గ్రామాల్లో పలువురు యోగాసనాలువేశారు.

కుభీర్: మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిరంలో ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ సేవాభారతి ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అడెపు శ్రీనివాస్, పోశెట్టి, శివలింగు యోగా ప్రయోజనాలను వివించారు. స్థానిక శ్రీసరస్వతీ శిశుమందిరంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ప్రధానాచార్యులు హన్మండ్లు పాల్గొన్నారు.

పెంబి: పాఠశాలల విద్యార్థులతో యోగాసనాలు వేశారు. మందపల్లిలో ఉపాధి కూలీలతో ఎంపీడీవో రమాకాంత్ యోగాసనాలు చేయించారు.



యోగాసనాలు వేస్తున్న ముధోల్ ఎమ్మెల్యే



లోకేశ్వరంలో..



దేగాంలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు



తానూరులో..



కుంటాల: కల్లూర్‌లో గురువు సన్మానిస్తూ..



కుభీర్‌లోని విఠలేశ్వర మందిరంలో..



ఖానాపూర్: పోలీస్‌స్టేషన్‌లో..

పాఠశాలలో బోరు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి ప్రాథమిక పాఠశాలలో బోరు వేశారు. బోరు లేక విద్యార్థులు ఇబ్బంది పడటంతో గ్రామస్తులు డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.50 వేలు మంజూరు చేయించారు. కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బోరు వేయించారు. నాయకులు గురాల లింగారెడ్డి, రమేశ్ తదితరులు ఉన్నారు.

బడి పునఃప్రారంభం

ఖానాపూర్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శుక్రవారం పునఃప్రారంభమైంది. గత 8 ఏళ్ల క్రితం విద్యార్థులు లేని కారణంగా ఉపాధ్యాయులు వేరే పాఠశాలల్లో బోధనలు చేశారు. ఇటీవల కాలనీవాసులు కలెక్టర్‌తోపాటు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో 30 మందికిపైగా విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం సంధ్యారాణి, సీఆర్పీ కవిత, ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు మురళీ శుక్రవారం తరగతులను ప్రారంభించారు. రిటైర్డ్ ఎంఈవో ఖాజా, రిటైర్డ్ ఏఎస్సై ఇస్మాయిల్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, కాలనీవాసులు జియా, షాకిర్, అజార్ ఉన్నారు.

పరామర్శ

తానూరు: మండలంలోని ఎల్వత్ గ్రామానికి చెందిన జాదవ్ రామ్ ఇటీవల పిడుగుపాటుకు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మోహన్‌రావ్ ప్రజాట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావ్ పటేల్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల చెక్కును అందజేశారు. నాయకులు రమేశ్ పటేల్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కాలనీలో పర్యటన

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బోయవాడ, శాస్త్రీనగర్ కాలనీలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పర్యటించారు. వర్షాలు దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని లోతట్టు ప్రాంతంలో డ్రైయినేజీ, వర్షపు నీరు మురుగుకాల్వల్లో వెళ్లేలా శుభ్రం చేయాలన్నారు. స్థానిక కౌన్సిలర్ తోకల లావణ్య–శంకర్ పతి, కాలనీవాసులు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల వివరాలు తెలపాలి

లోకేశ్వరం: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలను తెలపాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు సంటీన్న అన్నారు. మండలంలోని ధర్మోర గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమం కోసం పోరాడిన వారిపై ఉన్న కేసులను ఎత్తివేయాలన్నారు. అన్ని గ్రామాల్లో వారి జాబితాలు తయారు చేయలన్నారు. ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

వర్షం కురవాలని పూజలు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో వర్షం కురవాలని గ్రామ దేవతలకు గ్రామస్తులు శుక్రవారం పూజలు నిర్వహించారు. బాసర గోదావరి నది నుంచి గంగా జలాన్ని తీసుకువచ్చి భాజభజంత్రీలు, డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లారు. గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని గ్రామస్తులు అమ్మవార్లకు మొక్కు చెల్లించుకున్నారు.

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో గంగానీళ్లకు జాతరను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ముత్యాలమ్మ, మహాలక్ష్మి మందిరం వద్దకు గ్రామస్తులు ఊరేగింపుతో వెళ్లి భక్తులు పూజలు నిర్వహించారు. గ్రామాల సమీపంలోని గోదావరి నది నుంచి జలాలు తీసుకువచ్చి గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. వర్షాలు కురవాలని, పంటలు పండాలని మొక్కు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, నాయకులు రాజారం, గంగాకిషన్, రాములు, భోజన్న, గ్రామస్తులు ఉన్నారు.



కుంటాల: పూజలు నిర్వహిస్తున్న రైతులు

కుంటాల: వర్షం కురవాలని పాత వెంకూర్ గ్రామంలో రైతులు శుక్రవారం పూజలు చేశారు. హనుమాన్, గ్రామ దేవతలకు నదీజలాలతో అభిషేకించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నిర్మల్‌రూరల్: నిర్మల్ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం సాదాసీదాగా ముగిసింది. ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సీఈవో గోవిందు హాజరయ్యారు. తక్కువ సంఖ్యలో ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ఏపీఎం గంగన్నకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున రైతులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు సరిపడా విత్తనాలను సరఫరా చేస్తున్నామని ఏవో వసంతరావు పేర్కొన్నారు. ఎంఈవో శంకర్ మాట్లాడుతూ మండలంలో 90 శాతం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ఇప్పటికే పనులు పూర్తయ్యాయని తెలిపారు. మరో వారంలో ఉపాధ్యాయుల బదిలీలు పూర్తవుతాయన్నారు. విద్యార్థుల డ్రాపౌట్ ఎక్కడా లేవని తెలిపారు. ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, అటవీశాఖ, పశు సంవర్ధక శాఖల ప్రగతిని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో రూరల్ తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి



సోన్: న్యూవెల్మల్ గ్రామంలో జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీడీసీ సభ్యులు

జయశంకర్ సార్‌కు నివాళి

నిర్మల్‌చైన్‌గేట్/భైంసాటౌన్/నిర్మల్‌టౌన్/సోన్/సారంగపూర్/ఖానాపూర్: తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీల నాయకులు, సంఘాల ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్రం పరితపించిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- భైంసాలోని జయశంకర్ కాలనీలో జయశంకర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. జయశంకర్ సేవలను గుర్తు చేసుకున్నారు. జయశంకర్ సొసైటీ సభ్యులు అనుసురి శ్రీనివాస్, బెజ్జంకి రవి, డా రామకృష్ణగౌడ్ ఉన్నారు.
- నిర్మల్‌లో ఆయన విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, నాయకులు ఉన్నారు.
- సోన్ మండలం న్యూవెల్మల్ వీడీసీ, సేవా సభ్యులు కలిసి జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీడీసీ చైర్మన్ రోడ్ల రాజేశ్వర్, కోశాధికారి గజ్జల గంగాధర్, సేవా మాజీ అధ్యక్షులు పెంట దత్తాద్రి, రహిమొద్దీన్, పోశెట్టి, దయాసాగర్, పెద్ద లస్మన్న, గడ్డం స్వామి, మహేశ్వర్, వీడీసీ సభ్యులు ఉన్నారు.
- సారంగపూర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో జయశంకర్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు నర్సయ్య, ఉపాధ్యక్షుడు విలాస్‌రావు తదితరులు ఉన్నారు.
- ఖానాపూర్‌లోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జయశంకర్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. నాయకులు, సంఘ సభ్యులు ఉన్నారు.



నిర్మల్‌టౌన్: నివాళులర్పిస్తున్న నేతలు



ఖానాపూర్‌లో..



భైంసాటౌన్: నివాళులర్పిస్తున్న కాలనీవాసులు



సారంగాపూర్‌లో..

భక్తిశ్రద్ధలతో వటసావిత్రి వ్రతం

నిర్మల్‌టౌన్/ముధోల్ /కుంటాల/లోకేశ్వరం: భర్తలు ఆయురారోగ్యంగా ఉండాలని మహిళలు వటసావిత్రి వ్రతాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా రాగి, వేప, మర్రి చెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. దారంతో చుట్టూ ప్రదక్షిణ చేసి మొక్కు చెల్లించుకున్నారు. ఏటా జ్యేష్ఠ మాసంలో వివాహితులైన మహిళలు ఈ వ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



నిర్మల్‌లో పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా గంగమ్మ పండుగ

ఖానాపూర్: పట్టణంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇంద్రనగర్ కాలనీ నుంచి సంఘం ఆధ్వర్యంలో గంగపుత్రులు గోదావరి తీరంలోని శివగంగాగౌరి ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. సల్లముంతలతోపాటు గొల్లెనతో వెళ్లి గంగమ్మకు జలాభిషేకం చేశారు. అనంతరం పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు.



ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

దస్తురాబాద్: రాంపూర్, దస్తురాబాద్ గ్రామాల గంగపుత్రులు శుక్రవారం గోదావరి తీరప్రాంతంలోని గంగమ్మ ఆలయంలో బోనాలు సమర్పించి మొక్కు చెల్లించారు. గోదావరి తీరం డప్పు చప్పుళ్లతో మార్మోగింది.